ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్కార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 160 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 15 జనవరి 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ టూర్..

మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం?

ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ వెళ్లారు.

హైదరాబాద్, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దిల్లీ వెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ నేతలు కూడా దిల్లీ వెళ్లారు. బుధవారం ఏఐసీసీ కార్యాలయం ప్రారంభం అనంతరం సీఎం, పీసీసీ అధ్యక్షుడు ఏఐసీసీ నేతలను కలిసే అవకాశముంది. మంత్రివర్గ విస్త-రణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై చర్చించే అవకాశం ఉన్నట్టు పార్టీ శ్రేణ-ుల్లో ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బృందం 16న దిల్లీ నుంచి సింగపూర్ వెళ్తారు. ఈనెల 19 వరకు సింగపూర్లో పర్యటించి.. స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యంపై ఒప్పందాలు.. పారిశ్రామిక పెట్టుబడులపై సీఎం బృందం చర్చించనుంది. ఈనెల 20 నుంచి 22 వరకు దావోస్లో పర్యటించనున్నారు.

సుప్రీంకోర్టులో చంద్రబాబుకు ఊరట

సుప్రీంకోర్టులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించింది.

దిల్లీ, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): సుప్రీంకోర్టులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహల్గి కోర్టుకు వెల్లడించారు.

ఛార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం పేర్కొంది. గత ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్ ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీంకోర్టు సూచించింది. 2023 నవంబరులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేసిన స్వర్ణాంధ్ర పత్రిక విలేకరి బాల గంగాధర్ తిలక్పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరెవరు..? మీకేం సంబంధం..? పిల్ దాఖలు చేయడానికి ఉన్న అర్హత ఏంటి..? అని ప్రశ్నించింది. బెయిల్ వ్యవహారాల్లో మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ) ఎందుకు ఉంటారని ధర్మాసనం నిలదీసింది. సంబంధం లేని బెయిల్ వ్యవహారాల్లో పిటిషన్ ఎలా వేస్తారని జస్టిస్ బేలా త్రివేది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఇంకోసారి జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని విలేకరిని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఇంటర్లో కేటరీ అప్లికేషనన్ను డిస్మిస్ చేసింది.

సుప్రీంకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు..

పిటిషన్ కొట్టివేత

మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిటిష-న్‌ను సుప్రీంకోర్టు విచారణ కొట్టివేసింది.

హైదరాబాద్, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను సం-ర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. సీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్ధ్ ధర్మాసనం విచారణ జరిపింది. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరపు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్ ను డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరపు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్ ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు..!

ఫార్ములా ఈ కేసులో కేటీఆర్కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.

నౌకాదళంలోకి ఐఎన్ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్ షీర్.. జాతికి అంకితం చేసిన మోదీ

అధునాతన యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్ షీర్ ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు.

ముంబయి, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో మూడు అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్ షీర్లను బుధవారం నౌకాదళంలో చేర్చుకున్నారు. ముంబయిలోని నేవల్ డాక్యార్డ్లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరై.. యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. వీటి రాకతో నౌకదళ బలం మరింత పటిష్టం కానుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకుసాగుతున్న భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా నిలిచింది.

ఈసందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి. దేశ భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్క చేయ-రు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడింది. తొలిసారిగా.. రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామిని ఒకేసారి మనం ప్రారంభించుకున్నాం. ఇవన్నీ భారత్లో తయారైనవే. వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుంది" అని వివరించారు. "సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస-్తున్నాం. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో చేరాయి. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాం. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.25 లక్షల కోట్లు దాటింది. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు.



ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ-సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం.

ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారు.

ఐఎన్ఎస్ వాఘ్షీర్.. పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్సు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

భాజపా మళ్లీ నీచ రాజకీయాలు మొదలుపెట్టింది: ఆప్

ఆన్ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విచారించేందుకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్‌కు కేంద్రం అనుమతివ్వడంపై ఆప్ ఆగ్రహం వ్యక్తంచేసింది.

దిల్లీ, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): అసెంబ్లీ ఎన్నికలకు ముందు మద్యం కుంభకోణం కేసులో దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆన్ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్కు కేంద్రం అనుమతివ్వడాన్ని ఆన్ఆద్మీ పార్టీ వ్యతిరేకించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు భాజపా మళ్లీ తన నీచ రాజకీయాలను మొదలు పెట్టిందని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేశాక.. ఈడీ మళ్లీ వారిని విచారించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారని దుయ్యబట్టారు. "కేజీవాల్, సిసోదియాలకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండేళ్ల తర్వాత ఈ కేసును విచారించడానికి మళ్లీ కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థకు అనుమతి ఇచ్చింది. అది కూడా ఎన్నికలకు ముందు. తప్పుడు కేసులు పెట్టి ఆప్ నేతల పరువుతీయడం భాజపాకు రోజువారీ దినచర్యగా మారిందని ప్రజలకు ఇప్పుడు అర్థ-మైంది" అని ప్రియాంక అన్నారు. నూతన మద్యం విధానంలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై 2024 మార్చి 21న అప్పటి దిల్లీ సీఎం కేజీవాల్ను ఈడీ అరెస్టు చేసింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. గత సెప్టెంబరులో బెయిల్ మంజూరైంది. 70 శా-సనసభ స్థానాలు ఉన్న దిల్లీకి ఫిబ్రవరి 5న ఒకేవిడతలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈక్రమంలో మరలా ఆయనపై విచారణకు కేంద్రం ఈడీకి అనుమతివ్వడంతో దిల్లీ రాజకీయాలు మరింత వేడెక్కాయి.

నేను మరణిస్తే దానికి కారణం ఆప్ నేతలే..
షెహజాద్ పూనావాలా

అక్ఆద్మీ పార్టీ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని పేర్కొంటూ భాజపా జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా వీడియో విడుదల చేశారు. ఆప్ తనపై చేస్తున్న అసంబద్ధమైన ఆరోపణలను నిరసిస్తూ ఆ పార్టీ కార్యాలయం ముందు తాను ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఆప్ నేతలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని.. తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్ష చేస్తూ తాను మరణిస్తే దానికి ఆప్ని కారణం అవుతుందని అన్నారు.

మంత్రి నారా లోకేశ్తో మంచు మనోజ్ భేటీ

సినీనటుడు మంచు మనోజ్ మంత్రి నారా లోకేశ్తో భేటీ అయ్యారు.

నారావారిపల్లె, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): సినీనటుడు మంచు మనోజ్ మంత్రి నారా లోకేశ్తో భేటీ అయ్యారు. మనోజ్ కుటుంబ సమేతంగా హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మోహన్ బాబు యూనివర్సిటీకి భారీ ర్యాలీతో చేరుకోగా.. కోర్టు ఆర్డర్ నేపథ్యంలో లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల సూచనతో వెనుదిరిగిన మనోజ్ నేరుగా నారావారిపల్లె వెళ్లారు. భార్య మౌనికతో కలిసి లోకేశ్తో సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు భేటీ కొనసాగింది. అనంతరం మనోజ్ దంపతులు ఎ.రంగంపేట చేరుకుని పశువుల పండుగను వీక్షించారు. సాయంత్రం మోహన్ బాబు యూనివర్సిటీ ఆవరణలో ఉన్న తన నానమ్మ, అమ్మమ్మ సమాధుల వద్ద నివాళులర్పించిన తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్తారని మంచు మనోజ్ సన్నిహితులు తెలిపారు.

మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద భారీ బందోబస్తు

తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. యూనివర్సిటీకి మంచు మనోజ్ వస్తున్నారన్న సమాచారంతో గేటు వద్ద పోలీసులు వేచి ఉన్నారు. ఇప్పటికే యూనివర్సిటీలో మోహన్ బాబు, మంచు విష్ణు ఉండడంతో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. కాలేజీ పరిసర ప్రాంతాల్లోకి ఎవ్వరినీ అనుమతించడంలేదు. గేట్లను కూడా మూసివేశ-ారు.

స్థానికంగా తయారు చేయడంవల్లే చైనీస్ మాంజా విచ్చలవిడి అమ్మకాలు : హైదరాబాద్ సీపీ

హైదరాబాద్, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): చైనీస్ మాంజాపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానికంగా తయారు చేయడం వల్లే ఇది పెద్ద మొత్తంలో లభ్యమవుతోందని చెప్పారు. ఈ- కామర్స్ వెబ్సైట్లో ఆర్డర్ చేసుకుంటే ఇంటికే వస్తోందని పేర్కొన్నారు. త్వరలో ఈ-కామర్స్ గోదాములపై సోదాలు చేస్తామన్నారు. నిర్వాహకులతో సమావేశం సైతం ఏర్పాటు చేస్తామని చెప్పారు. చైనీస్ మాంజా వినియోగాన్ని అరికట్టడంలో ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడు అరెస్ట్.. తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం

హైదరాబాద్, జనవరి 15, (రిపబ్లిక్ న్యూస్): ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. ఉత్తరప్రదేశ్కు చెందిన హరేకృష్ణను అరెస్టు చేసిటన్లు సీపీ వెల్లడించారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను సీపీ మీడియాకు వెల్లడించారు. నిందితుడు హరేకృష్ణ హైదరాబాద్లో తుపాకులు విక్రయిస్తున్నాడని, అతని వద్ద నుంచి తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1784:** కలకత్తాలో ఆసియాటిక్ సొసైటీని విలియం జోన్స్ స్థాపించారు.
- **1887:** ప్రముఖ హేతువాద రచయిత, సంఘసంస్కర్త త్రిపురనేని రామస్వామి జననం (మ.1943).
- **1915:** ప్రముఖ తెలుగు రచయిత, చాసోగా అందరికీ సుపరిచితుడు చాగంటి సోమయాజులు జననం (మ.1994).
- **1929:** అమెరికాకు చెందిన పాస్టర్, ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ జననం (మ.1968).
- **1929:** హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర ప్రదేశ్ గవర్నరుగా పనిచేసిన రాంలాల్ జననం (మ.2002).
- **1934:** భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధాన ఎన్నికల కమీషనర్ వి.ఎస్.రమాదేవి జననం (మ.2013).
- **1940:** వాడుక భాష ఉద్యమ పిత గిడుగు రామమూర్తి మరణం (జ.1863).
- **1967:** తెలుగు సినిమా నటి భానుప్రియ జననం.
- **1998:** పూర్వ తాత్కాలిక ప్రధానమంత్రి గుల్జారీలాల్ నందా మరణం (జ.1898).
- **1949:** జాతీయ సైనిక దినోత్సవం


ఆసియాటిక్ సొసైటీని విలియం జోన్స్

త్రిపురనేని రామస్వామి


చాగంటి సోమ-యాజులు

మార్టిన్ లూథర్ కింగ్

రాంలాల్

వి.ఎస్.రమాదేవి

గిడుగు రామమూర్తి

భానుప్రియ

గుల్జారీలాల్ నందా

సైనిక దినోత్సవం

ప్రభాస్ 'కల్కి2' రిలీజ్.. అశ్వనీదత్ ఏం చెప్పారంటే!

'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ గురించి అశ్వనీదత్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇందులో మూడు పాత్రలకు ప్రాధాన్యముంటుందన్నారు.

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. ఇక ఈ సినిమాకు సీక్వెల్ ఉన్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. తాజాగా ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ ఓ ఇంటర్వ్యూలో 'కల్కి 2' గురించి మాట్లాడారు. అలాగే తన అల్లుడు, డైరెక్టర్ నాన్‌అశ్విన్పై ఆసక్తికర కామెంట్స్ చేశారు. "కల్కి 2" వచ్చే ఏడాది విడుదలవుతుంది. రెండో పార్ట్ మొత్తం కమల్ హాసనే ఉంటారు. ప్రభాస్, కమల్ హాసన్ల మధ్య సన్నివేశాలు ఉంటాయి. అమితాబ్ బచ్చన్ పాత్రకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ఈ మూడు పాత్రలే ఎక్కువగా కనిపిస్తాయి. వీళ్లే ఆ సినిమాకు మెయిన్. వీళ్లతో పాటు దీపికా పదుకొణె పాత్రకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. కొత్త వాళ్లు ఉంటారని నేను అనుకోవడం లేదు. ఒకవేళ కథకు అవసరమైతే రెండో పార్టీలో కొత్త వాళ్లు ఉండే అవకాశం ఉంది" అని అన్నారు. ఇక నాన్‌అశ్విన్ గురించి అశ్వనీదత్ మాట్లాడుతూ.. మంచి దర్శకుడని కొనియాడారు. "మహానటి' సినిమా తీసే సమయంలో ఎక్కడా భయం లేకుండా షూటింగ్ పూర్తి చేశాడు. తర్వాత 'కల్కి' రూపొందించాడు. రెండూ సూపర్ హిట్గా నిలిచాయి. నాగ్ అశ్విన్కు జీవితంలో ఓటమనేది ఉండదని నేను నమ్ముతాను. అతడి ఆలోచనా విధానం, సినిమాలను తెరకెక్కించే తీరు చాలా గొప్పగా ఉంటాయి" అని చెప్పారు. వైజయంతి మూవీస్ పతాకంపై అశ్వనీదత్ 'కల్కి 2898 ఏడీ' చిత్రాన్ని నిర్మించారు. భారీ బడ్జెట్తో తెరకెక్కిన ఈ సినిమా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆడియన్స్ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఈ చిత్రంలో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు. బౌంటీ ఫైటర్ భైరవగా సందడి చేసిన ప్రభాస్ చివర్లో కర్ణుడిగా కనిపించి పార్ట్ 2పై మరిన్ని అంచనాలు పెంచేశారు.



లోకల్ ఛానల్లో 'గేమ్ ఛేంజర్' ప్రసారం.. టాలీవుడ్ నిర్మాత ఆగ్రహం

'గేమ్ ఛేంజర్' సినిమా లోకల్ ఛానల్లో ప్రసారం చేయడంపై టాలీవుడ్ నిర్మాత ఆగ్రహం వ్యక్తం చేశారు.

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్. ఈ సినిమా విడుదలై వారం రోజులు కూడా కాకముందే ఓ లోకల్ ఛానల్లో ప్రసారం చేశారు. దీనికి సంబంధించిన స్క్రీన్ షాట్లు నెటిజన్ సోషల్ మీడియాలో షేర్ చేసి అసహనం వ్యక్తంచేశారు. దీనిపై టాలీవుడ్ నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్వీఎన్) ఆగ్రహం వ్యక్తంచేశారు. సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందన్నారు. "ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. 5 రోజుల క్రితం ప్రేక్షకుల ముందుకువచ్చిన చిత్రాన్ని లోకల్ ఛానళ్లలో, బస్సుల్లో ప్రసారం చేస్తున్నారు. ఈవిషయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సినిమా అంటే కేవలం హీరో, దర్శకుడు, నిర్మాతలే కాదు.. ఇది 4 సంవత్సరాల కృషి. వేలాది మంది కలల ఫలితం. ఇలా లీక్ చేసే ముందు సినిమా విజయంపై ఆధారపడి జీవిస్తున్న డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల గురించి ఆలోచించండి. ఇలాంటి పనులు చిత్ర పరిశ్రమ భవిష్యత్తుకు కూడా ముప్పు కలిగిస్తాయి. ఈ చర్యలకు ముగింపు పలికేందుకు ప్రభుత్వాలు ముందుకురావాలి. దీనికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. సినిమాను కాపాడడానికి, భరోసానివ్వడానికి అందరం కలిసి పని చేద్దాం" అని పోస్ట్ పెట్టారు. దీనికి #SaveTheCinema అనే హ్యాష్ ట్యాగ్ను జోడించారు. ఇక తాము అడిగినంత డబ్బు ఇవ్వకపోతే 'గేమ్ ఛేంజర్' సినిమాని లీక్ చేస్తామంటూ బెదిరించిన వారిపై చిత్రబృందం సైబర్ క్రైమ్లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మూవీ రిలీజ్కు రెండు రోజుల ముందు కీలక సన్నివేశాలను సోషల్ మీడియాలో షేర్ చేశారని, రిలీజ్ కాగానే ఆన్లైన్లో లీక్ చేశారని టీమ్ ఫిర్యాదులో పేర్కొంది. ఆధారాలు సేకరించిన చిత్ర బృందం.. 45 మందితో కూడిన ముఠాపై ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అలాగే, సోషల్ మీడియా వేదికగా సినిమాపై నెగెటివిటీ సృష్టిస్తున్న కొన్ని ఖాతాల పైనా 'గేమ్ ఛేంజర్' టీమ్ కంప్లైంట్ ఇచ్చింది.

రిపబ్లిక్ స్పోర్ట్స్

టీమ్ ఇండియాకు 'ఇంగ్లిష్' పరీక్ష.. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే పుంజుకొనేనా..!

టీమ్ ఇండియా చాంపియన్స్ ట్రోఫీకి ముందే అగ్ని పరీక్ష ఎదుర్కోనుంది. బజ్బాల్ జట్టుగా పేరున్న ఇంగ్లాండ్ తో పరిమిత ఓవర్ల సిరీస్‌ను ఎదుర్కోనుంది.

టీమ్ ఇండియాకు పొట్టి ప్రపంచకప్ గెలిచిన ఆనందం ఏడాది కూడా నిలవలేదు. ఆ టోర్నీ ముగిసిన నాటి నుంచి వరుస ఓటములను చవిచూస్తూ వస్తోంది. డబ్ల్యూటీసీ ఫైనల్కు అలవోకగా వెళ్లడం ఖాయమనుకొన్న వేళ.. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీసుల ఫలితాలతో జట్టు చతికిలపడింది. దీనికి తోడు డ్రెస్సింగ్ రూమ్ విషయాలూ అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ దశలోనే బజ్బాల్లో క్రికెట్ను సమూలంగా మార్చేస్తామంటూ దూసుకెళ్తున్న ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు వస్తోంది. మరో వారంలో మ్యాచ్లు ప్రారంభం కానున్నాయి. ఈ సీజన్ లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

వన్డేలే కీలకం..

తొలుత టీమ్ ఇండియా ఐదు టీ20ల్లో ఇంగ్లండ్ జట్టుతో తలపడనుంది. హారీ బ్రూక్, జోస్ బట్లర్, లివింగ్ స్టోన్, ఫిల్ సాల్ట్ వంటి అనుభవజ్ఞులతో ఆ టీమ్ బలంగా ఉంది. మరోవైపు భారత్కు కీలక అస్త్రమైన జస్ప్రీత్ బుమ్రా గాయం బారిన పడి విశ్రాంతిలో ఉన్నాడు. దీంతో పొట్టి సిరీస్లో భారం మొత్తం మహ్మద్ షమీ, అర్షిప్ సింగ్, రవి బిష్ణోయ్ పైనే పడనుంది. ఈ సిరీస్లో షమీ సత్తా చూపిస్తే ఛాంపియన్స్ ట్రోఫీ నాటికి బౌలింగ్ విషయంలో భారత్ చింత కొంచెం దూరం కానుంది. బ్యాటింగ్ లో సూర్య కుమార్, హార్దిక్ మినహా మిగిలిన వారంతా కుర్రాళ్లే. సంజు శాంసన్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, రింకూ సింగ్ ఇలా అందరూ తమదైన రోజున మ్యాచ్ను గెలిపించగల సత్తా ఉన్నవారే. ఎటొచ్చి.. వన్డేలే భారత్ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2023 ప్రపంచకప్ తర్వాత భారత్ సరిగ్గా వన్డేలు ఆడలేదు. గతేడాది శ్రీలంకతో మూడు మ్యాచ్లు మాత్రమే ఆడింది. 27 ఏళ్ల తర్వాత లంకకు సిరీస్ కోల్పోయి ఓ చెత్త రికార్డును మూటగట్టుకొంది. మూడు మ్యాచ్లో 27 వికెట్లను లంక స్పిన్నర్లు కూల్చారు. ఇప్పుడు ఇంగ్లండ్తో వన్డే సిరీస్లో భారత్లోని పిచ్లపై జరగనుంది. ఆదిల్ రషీద్ వంటి నాణ్యమైన స్పిన్నర్ ఆ జట్టులో ఉన్నాడు. అతడికి అండగా లివింగ్ స్టోన్ వంటి వారు భుజం కాసే అవకాశం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత మ్యాచ్లకు వేదికైన యూఏఈ పిచ్లు స్పిన్నర్లకు సహకరించే అవకాశాలుండటంతో ఈ సిరీస్ భారత్కు వార్మప్ ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.

వారి ముగ్గురికి గడ్డుకాలమే..

విమర్శల జడివానలో తడిసి ముద్దయిన స్టార్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మకు ఈ సిరీస్ కీలకం. ఇందులో రాణించకుండా ఛాంపియన్స్ ట్రోఫీకి వెళ్లి.. అక్కడా విఫలమైతే కెరీర్ కష్టాల్లో పడ్డట్లే. కాకపోతే కొన్ని నెలల క్రితం ఆడిన లంక సిరీస్లో రోహిత్ రాణించడం ఒక్కటే ఊరట. ఇక ఇప్పటివరకు కోచ్గా ఎలాంటి వందర్లు చూపని గంభీర్కు ఈ సిరీస్ అగ్ని పరీక్షే. బుమ్రా ఇంగ్లండ్తో వన్డే సిరీస్ నాటికి కోలుకుంటే షమీతో కలసి పేస్ దళాన్ని నడిపిస్తాడు.

రికార్డుల్లో భారత్ పై చేయి..

- ఇప్పటివరకు టీ20ల్లో ఇరు జట్లు 24 సార్లు తలపడితే.. 13 సార్లు భారత్, 11 సార్లు ఇంగ్లండ్ విజయం సాధించాయి.
- వన్డేల్లో 107 సార్లు పోటీపడ్డాయి. 58 సార్లు ఫలితం భారత్ పక్షాన నిలిచింది. 44 సార్లు ఇంగ్లండ్ విజయం. ఐదు మ్యాచ్లు డ్రా.

ఆరోగ్యం

అప్పుడప్పుడు వేరుశనగ నూనె వాడితే గుండె ఆరోగ్యంతో పాటు ఈ లాభాలు కూడా, మితంగానే తీసుకోవాలి సుమా

పల్లీల నూనె.. పల్లీల నుంచి తయారుచేస్తారు. సాధారణంగా ఈ నూనెని బేకింగ్, సాటింగ్, ఫ్రైయింగ్ వంటి వంటల్లో వాడతారు. దీనిని తినడం వల్ల ఎలాంటి లాభాలు ఉన్నాయో తెలుసుకోండి.

మిగతా నూనెలతో పోలిస్తే పల్లీ నూనె కొద్దిగా రుచి వేరుగా ఉంటుంది. ఈ నూనెతో కొన్ని వంటలు చేయడం చాలా మంచిది. ఈ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ ఉంటుంది. ఇది మంచి యాంటీ ఆక్సిడెంట్. ఇందులో ఎక్కువగా హెల్దీ ఫ్యాట్స్ ఉంటాయి. వీటితో పాటు కేలరీలు, ఫ్యాట్, శాచ్యురేటెడ్ ఫ్యాట్, విటమిన్ ఈ, మోనో శాచ్యురేటెడ్ ఫ్యాట్, పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్, ఫైటోస్టెరాల్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఈ నూనెని మితంగా తీసుకోవడం వల్ల చాలా లాభాలున్నాయి. అవేంటంటే..

కొలెస్ట్రాల్‌ని తగ్గించడం

వేరుశనగన నూనెలోని మోనోఅన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ మీ బాడీలో చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఈ చెడు కొలెస్ట్రాల్‌ని ధమనులని అడ్డుకుంటుంది. గుండె జబ్బులు, స్ట్రోక్‌కి కారణమవుతుంది.

డయాబెటిస్ కంట్రోల్‌కి

కొన్ని అధ్యయనాల ప్రకారం, ఈ నూనె తీసుకోవడం వల్ల సంతృప్త కొవ్వులకి బదులుగా పాలీ అన్‌శాచ్యురేటెడ్ కొవ్వులని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ స్రావం కూడా మెరుగ్గా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచుతుంది.

బ్రెయిన్ హెల్త్

వేరుశనగ నూనెలో మంచి ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి బ్రెయిన్ హెల్త్‌కి చాలా మంచిది. వయసు పెరిగేకొద్దీ వచ్చే అనేక సమస్యల్ని ఈ వేరుశనగ నూనె దూరం చేస్తుంది. ఈ నూనెని తీసుకోవడం వల్ల బ్రెయిన్ సెల్స్ టాక్సిన్స్, ఆక్సిడేటివ్ స్ట్రెస్ వంటి నుంచి కాకుండా ఉంటాయి. దీంతో పాటు అల్జీమర్స్ వంటి సమస్యల్ని కూడా తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యం



పల్లీ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ, మోనోశాచ్యురేటెడ్, పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవన్నీ గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. అధ్యయనాల ప్రకారం, ఈ పల్లీ నూనె తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మరో అధ్యయనం ప్రకారం, ఈ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ ఉంటుంది. ఇది బాడీని ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడుతుంది. దీని వల్ల సెల్స్ డ్యామేజ్ కాకుండా ఉంటాయి. క్యాన్సర్స్, గుండె సమస్యలు రాకుండా ఉంటాయి.

స్కిన్ ప్రాబ్లమ్స్

పల్లీ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల స్కిన్ ఎలాస్టిసిటీ పెరుగుతుంది. దీని వల్ల గాయాలు త్వరగా తగ్గుతాయి. ఈ నూనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. దీనిని తీసుకోవడం వల్ల ఎగ్జిమా, సోరియాసిస్ వంటి సమస్యలు తగ్గుతాయి. ఇందులో ఫ్యాటీ యాసిడ్ ఉంటాయి. ఇవి స్కిన్‌కి చాలా మంచిది. ఇది స్కిన్‌ని హైడ్రేట్‌గా చేస్తుంది.

సైడ్ ఎఫెక్ట్స్

పల్లీ నూనె మంచిదే అయినప్పటికీ దీనిని తీసుకోవడం వల్ల కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. అవి ఏంటంటే.. కొంతమందికి ఈ నూనె పడదు. అలర్జీలు వస్తుంటాయి. ముఖ్యంగా పిల్లల్లో. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ముడి, కోల్డ్ ప్రెస్డ్‌తో పోలిస్తే ప్రాసెస్డ్ పల్లీ నూనె కాస్తా బెటర్. అయినప్పటికీ, ఏదైనా సమస్య అనిపిస్తే దీనిని తీసుకోవద్దు. అదే విధంగా, వేరు శనగ నూనెలో ఎక్కువగా ఒమేగా 6 ఫ్యాట్స్ ఉంటాయి. ఈ నూనెని తీసుకోవడం వల్ల గుండె సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అందుకే, మితంగా తీసుకోవాలి.గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.